


'పోలు' సేవలు అభినందనీయం: ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎఎస్ఐ పోలు వెంకటేశ్వరరావు సేవలు పోలీసు యంత్రాంగం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. జిల్లా పోలీసు విభాగంలో నిరంతరం విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన వెంకటేశ్వరరావును శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వరరావు శాలువ, పులమాల వేసి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వెంకటేశ్వరరావు సుదీర్ఘకాలంగా పోలీసు శాఖలో అంకితభావంతో విశేష సేవలు అందించారని, క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించడంతో పాటు, ప్రజలకు అహర్నిశలు సేవలు అందించారని పేర్కొన్నారు. నేటి వరకూ కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించారంటు ప్రశంసించారు. పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదైనా సమాజ రక్షణ కోసం సేవ చేయడం గొప్ప గౌరవంగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఎఒ బి.కృష్ణుడు, డిసిఆర్‌బి సిఐ ఎం.తులసీరాం, ఆర్‌ఐ ఎం.పెద్దయ్య, ఎస్‌బి సిఐ పి.రాజా రమేష్, రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ సిఐ టి.మధు, ఆర్‌ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, పదవీ విరమణ పొందిన ఎఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విదిలింపులే!

- 'ఉక్కు' పరిశ్రమ ఊసేదీ
- మామిడి క్లస్టర్‌లో అన్నమయ్య జిల్లా
- డ్వాక్రా మహిళల రుణ ప్రస్తావన కరువు
- రూ.488.56 కోట్లతో జిఎన్ఎస్ఎస్ పనులు
- రూ.3,245 కోట్లతో హెచ్ఎన్ఎస్ఎస్ కేటాయింపు



రాష్ట్ర బడ్జెట్ 2025-26 విదిలింపులకు పరిమితమైంది. జిల్లా ప్రగతి చోదక శక్తులైన నీటిపారుదల, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల కేటాయింపులను పరిశీలిస్తే నిరాశను కలిగించింది. రూ.4,454 కోట్లతో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు, మామిడి క్లస్టర్ జిల్లాల జాబితాలో అన్నమయ్య జిల్లాకు చోటు దక్కడం స్వల్ప ఉపశమనం కలిగించడం మినహా వ్యవసాయ, పారిశ్రామిక కేటాయింపులు నిరాశను మిగిల్చాయని చెప్పవచ్చు. జిల్లా జీవనాడియైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కొప్పర్తి ఎంఎస్ఎంఇల పురోగతికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు. వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు మౌళిక సదుపాయాల కల్పనను విస్మరించింది. డ్వాక్రా మహిళలకు రుణాలు, ఫీజురియింబర్స్‌మెంట్, తల్లికివందనం నిరుద్యోగ భృతి తదితర సంక్షేమ పథకాల వ్యయాల్ని సైతం నిర్లక్ష్యం చేసినట్లు కనిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/యంత్రాంగం

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం రూ.3,22,359 కోట్లతో 2025-26 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కీలక రంగాల కేటాయింపులను పరిశీలిస్తే తీవ్రనిరుత్సాహాన్ని కలిగించింది. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల పరిధిలోని ప్రాజెక్టులకు రూ.4,454 కోట్లతో కూడిన సాగునీటి పారుదల రంగ కేటాయింపులు ఉపశమనం కలిగించాయని చెప్పవచ్చు. 2023-24 బడ్జెట్‌లో సాగు నీటిపారుదల రంగానికి రూ.3,800 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. 2025-26 బడ్జెట్‌లో రూ.4,454 కోట్లు కేటాయింపులు చేసింది. హెచ్ఎన్ఎస్ఎస్‌కు 3,243 కోట్లు, జిఎన్ఎస్ఎస్‌కు రూ.488 కోట్లు, కెసికి రూ.183.85 కోట్లు, టిజిపి రూ.345 కోట్లు, పిబిసికి రూ.170 కోట్లు, వెలిగల్లుకు రూ.ఐదు కోట్లు, లోయర్ సగిలేరు రూ.20 కోట్లు, మైలవరానికి రూ.35 లక్షలు కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో జిల్లా జీవనాడియైన ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే చేయలేదు. 2022-23 బడ్జెట్‌లో యోగివేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు, సిప్రెట్రాన్‌కు రూ.10 లక్షల చొప్పున కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత బడ్జెట్‌లో యోగివేమన, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ, ఎపికార్ల్ విద్యా, పరిశోధక సంస్థల ప్రస్తావన కనిపించలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.10 వేల కోట్లు కేటాయింపులు చేయాల్సి ఉండగా, రూ.6,300 కోట్లు కేటాయింపులు చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన సుమారు ఏడు లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. నాలుగు నెలల బడ్జెట్‌లో తల్లికివందనం పథకానికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించినప్పటికీ రూపాయి ఖర్చు చేయని నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. నాలుగు నెలల కిందటి బడ్జెట్‌లో సున్నా వడ్డీ పథకానికి రూ.687 కోట్లు కేటా యించగా, తాజా బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు ప్రకటనతో స్వల్ప ఊరట లభించింది. ప్రతికౌలు రైతుకూ ఏడాదికి రూ.20 వేలు పంపిణీ చేయ నుంది. ఉమ్మడి జిల్లాలో ఏడు నుంచి 14 వేల మంది కౌలు రైతులకు లబ్ధి చేకూరనుందని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలోని గండికోట డిస్ట్రిబ్యూటరీలు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, కాలేటివాగు, పింఛా, ఎల్ఎస్‌పి, నిలిచిపోయిన కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయలేదు.

అంకెల గారడీ బడ్జెట్



బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగింది. పేదలకు ఒరిగేదేమీ లేదు. అంకెల గారడీ బడ్జెట్. గత ప్రభుత్వాన్ని తిట్టడం, చంద్రబాబు, లోకేష్‌ని పొగడడంతోనే సరిపెట్టారు. వాగ్దానాల్లో అరకొరగా ఒకటి, రెండు తప్ప ఏమీ చేయలేదు. మహిళలు, నిరుద్యోగుల ఊసే లేదు. మహిళలకు ఉచిత బస్సు గురించి ప్రస్తావనే లేదు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను ప్రభుత్వం మోసం చేసింది. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ లాంటి స్కిమ్ కార్మికులు వేతనాలు పెంచాలని అడుగుతుంటే పట్టించుకోలేదు. పేదలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతుల వ్యతిరేక బడ్జెట్.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్, అన్నమయ్య.

కేటాయింపులు శూన్యం



బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం. అంతా అంకెల గారడి అభూత కల్పన అని దశ దిశ లేని పస లేని బడ్జెట్. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు. నిధులు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి మనసు రాలేదు.

- గాజుల భాస్కర్, డిసిసి అధ్యక్షులు, అన్నమయ్య.

బడ్జెట్‌లో కార్మికులకు చోటేదీ?



బడ్జెట్‌లో కార్మికులకు చోటు లభించలేదు. అంగన్వాడీ, ఆశా, విఒఎ, గ్రామ పంచాయతీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు, విద్యుత్, మున్సిపల్, గ్రామాసేవకులకు జీతాల పెంపుతో పాటు అనేక స్కీమ్ వర్కర్లు వేతనాల గురించి ప్రస్తావన లేదు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ ప్రత్యేక బోర్డు పునరుద్దరణ లేదు. హామీల అమలుకు బడ్జెట్‌లో చోటు లేదు. వ్యవసాయ కార్మికులకు, రైతులకు, శ్రమ చేసే కార్మికుల జీవితాల అభివృద్ధిలో ఏ మార్పు లేదు. పెరిగిన ధరల ప్రకారం కార్మిక ఉద్యోగుల వేతనాల పెంపు కోసం బడ్జెట్‌లో మార్పులు చేయాలి.

- ఎ.రామాంజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య.

మోసపూరిత బడ్జెట్



మోసపూరిత బడ్జెట్‌ను తలపిస్తోంది. బడ్జెట్ ప్రతిపాదనల్లో వాస్తవికత లోపించింది. సంక్షేమపథకాలైన తల్లికివందనం, మహిళాశక్తి, ఉచిత బస్సు సదుపాయం ప్రస్తావనే కనిపించలేదు.

- గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అన్నమయ్య.

పాఠశాల విద్యకు 20శాతం నిధులు కేటాయించాలి



ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో 20శాతం నిధులు కేటాయించాలి. కొఠారి కమిషన్ చెప్పిన దానిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో పాఠశాల విద్యాశాఖకు 9.86శాతం మాత్రమే విధులను కేటాయించడం పట్ల యుటిఎఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలా తక్కువ కేటాయింపులు చేయటం వల్ల ప్రభుత్వ విద్యారంగ బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగుతున్నదనే భావన ఏర్పడుతుంది.

-బి.లక్ష్మిరాజా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షలు రాయనున్న 28,916 మంది విద్యార్థులు
- 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు



రాయచోటిలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బల్లలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో శనివారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 153 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ 25, ఎయిటెడ్ 1, ఎపిఆర్‌జెసి 2, మోడల్ స్కూల్ 17, కెజిబివి 22, ఒకేషనల్ 11, సోషల్ వెల్ఫేర్ 10, హైస్కూల్ 4, ఎంజెఆర్‌ఎపి 1, ప్రయివేట్ 57 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 28,916 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. మొదటి సంవత్సరం 13,703 మంది జనరల్, 1159 ఒకేషనల్, ద్వితీయ సంవత్సరం 12,944 మంది జనరల్, 1110 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ 21, మెడల్ స్కూల్ 2, ప్రయివేట్ ఎయిడెడ్ 1, ప్రయివేట్ యూనియిడ్ 22, సోషల్ వెల్ఫేర్ 3 కళాశాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కేంద్రాల్లోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు.

సిబ్బంది ఏర్పాటు: చీఫ్ సూపర్ సూపర్నెంట్ ఆఫీసర్లు 49, డిపార్ట్మెంట్ ఆఫీసర్ సూపర్నెంట్ 49, సిట్టింగ్ స్క్వాడ్ 4, ఫ్లేయింగ్ స్క్వాడ్ 2, 963 ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సును సౌకర్యాలు కల్పిస్తున్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం, తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు.

ప్రతి విద్యార్థికి జీవితంలో ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత కీలకమైనవి. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు ఎవరికి వారే పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాలలో అన్ని వసతులను వసతులు కల్పించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం



శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేస్తున్నాం. సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. జిల్లా, రాష్ట్రడ స్థాయిలో అధికారులు సిసి కెమెరా ఫుటేజ్‌లో పర్యవేక్షిస్తారు. సెంటర్లోకి విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావలసిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలలో ఉంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు 8106624853 నంబర్‌కు సప్రదించగలరు.

- ఎం.కృష్ణయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, అన్నమయ్య.

పోసానికి 14 రోజుల రిమాండ్

రాజంపేట సబ్ జైలుకు తరలింపు



పోసానిని రాజంపేట సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/రాజంపేట అర్బన్

వైసిపి నేత, నటుడు పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల వాదనలు కొనసాగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి పి.జె.తేజ సాయి పోసానికి మార్చి 12వ తేదీ వరకు రిమాండ్ విధించారు అనంతరం రైల్వేకోడూరు సిఐలు వెంకటేశ్వర్లు, హేమ సుందర్‌రావు పోసానిని రాజంపేట సబ్ జైలుకు తరలించారు. ఓబువారిపల్లె పోలీసుస్టేషన్‌లో సుదీర్ఘంగా 9 గంటల పాటు అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు విచారణ చేశారు. కొద్దిసేపు విచారణకు సహకరించకుండా మొండి చేసిన పోసాని తాను అసభ్యకరంగా మాట్లాడిన వీడియోలను చూపిన అనంతరం చెప్పుడు మాటలు విని చాలా పెద్ద తప్పు చేశానని, అలా మాట్లాడి ఉండకూడదని ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నానని, తాను చేసిన వ్యాఖ్యలు వ్యవహారం ఇంతవరకు వస్తుందని తెలియక తప్పు చేశానని ఇంతకన్నా చెప్పేదేమీ లేదదని పోసాని చెప్పారని పోలీసులు పేర్కొన్నారు. పోసాని తరపు తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో పాటు మరో పది మందికిపైగా న్యాయవాదులు వాదనలు వినిపించారు, ప్రభుత్వం తరపున ఎపిపి చిట్టిబాబు, ప్రభుత్వ ప్లీడర్ మోబినా, తెలుగుదేశం పార్టీ తరపున మరికొంత మంది న్యాయవాదులు వాదనలు వినిపించారు. విరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి తేజ సాయి 196, 353 సెక్షన్లు పరిగణలోకి తీసుకొని, 111 సెక్షన్ పరిగణలోకి తీసుకోకుండా మార్చి 12వ తేదీ వరకు 14 రోజులు రిమాండ్ విధించారు. పోసానికి 2261 ఖైదీ నెంబర్ కేటాయించారు.

'ఆకేపాటి' ఎస్టేట్ ఆక్రమణలు రద్దు!

- 38 ఎకరాలు స్వాధీనానికి ఆదేశాలు
- కోర్టును ఆశ్రయించే యోచనలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/రాయచోటి

ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నెలన్నర రోజుల కిందట నుంచి కొనసాగుతున్న ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణల వ్యవహారం కొనసాగుతోంది. ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణలపై రాజంపేటకు చెందిన టిడిపి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణల తేనెతుట్టే కదిలింది. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆక్రమణ భూములను సర్వే చేసి, రెవెన్యూ రికార్డులను పరిశీలన చేసింది. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఆకేపాటి ఎస్టేట్ భూముల రికార్డులకు సంబంధించిన ఆధారాలను అందజేయాలని ఆదేశించారు. స్పందించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి తన న్యాయవాది ద్వారా ఆకేపాటి, మందరం, శేషమాంబపురం, తదితర గ్రామాల పరిధిలోని తన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న 814.3, 814.4, 815.1, 815.2, 816.2, 56.8, 56.9 తదితర సర్వే నెంబర్లు కలిగిన భూముల రికార్డులను అందజేశారు. సుదీర్ఘ పరిశీలన చేసిన అనంతరం 28 ఎకరాల ఆమ్రణలన్ని గుర్తించి రద్దు చేయడానికి మొగ్గ చూపించారు. తన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూముల్లో కొన్నింటిని ఆయన భార్య, కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు చేసినట్లు గుర్తించినట్లు సమాచారం. వీటిని గుర్తించిన రెవెన్యూ కోర్టు ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్ భూముల స్వాధీనాన్ని నిలువరించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించే ఆలోచనల్లో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డిఎస్‌పిలకు కమిటీ వినతి


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఎస్‌పి కొండయ్య నాయుడుకు విన్నవించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక కదిరి రోడ్డులో మసీదుల నిర్వహణ కోసం హజరత్ టిప్పు సుల్తాన్ ఇచ్చిన మసీదు మాన్యాలను కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కాజేసే ప్రయత్నిస్తున్నారని, వారిని కఠినంగా శిక్షించి అరెస్టు చేయాలని కోరారు. వక్ఫ్ ఆస్తులపై జామియా మసీదుకు తప్ప ఇతరులకు ఎలాంటి సంబంధం లేదని, 2004లో మదనపల్లిలోని సీనియల్ సివిల్ జడ్జ్ 33/94లో తీర్పు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూవక్ఫ్ ఆస్తు లను పరిరక్షించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ఆస్తులపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించి కాపాడుటకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు దృష్టికి సమస్య వెళ్లింది కాబట్టి పరిష్కారమవు తుందన్నారు. కార్యక్రమంలో జామియా మసీదు పరిరక్షణ కమిటీ సభ్యులు, మసీదు పెద్దలు హాజీ గౌస్ మొహియొద్దీన్, అబూబకర్, అక్బర్ బాషా, సాజీద్ అలీ ఖాన్ సర్దార్ ఖాన్, గౌస్, సికిందర్ బాషా పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవత తిరుణాల
మహోత్సవ శుభాకాంక్షలు
అనంతపురం గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా.



అనంతపురం గంగమ్మ దేవత
జాతరకు విచ్చేయు
భక్తులకు, అధికారులకు,
ప్రజాప్రతినిధులకు
శ్రీ గంగమ్మ దేవత ఆశీస్సులు
ఎల్లవేళలా ఉండాలని
కోరుకుంటూ...
మీ...
పట్టెం శ్రీరామ మూర్తి
గంగమ్మ జాతర టెంకాయల కాంట్రాక్టర్,
కొండావాండ్లపల్లి, చక్రాయపేట మండలం.



మౌలిక వసతులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పీలేరు

దళిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలో మేళ్లచెరువు ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమేశ్వరరావు, ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించి, గ్రామాల్లోని అసమానతలను, వివక్షను తొలగించాలన్న ఉద్దేశంతోనే ఈ ప్రాంతంలో ఈ సమావేశం నిర్వహించామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్సీ, ఎస్టీ ప్రజలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, ఎంఎస్‌పి నాయకులు వెంకటేష్, జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఎంపిడిఒ శివశంకర్, హౌసింగ్ డిఇ రమణ, ఎపిఒ అశోక్, ఎఒ రమాదేవి, డాక్టర్ వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జెవివి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జనవిజ్ఞాన వేదిక 37వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢవిస్వాసాలను నియంత్రించడంతో పాటుగా నిరక్షరాస్యత నిర్మూలన, మద్యపాన నిషేధం, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత వంటి లక్షణాలతో జనవిజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు. పూర్వ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సైన్సు ఫలితాలు ప్రజలకు చేకూరాలని సైన్సు ప్రజల జీవితాలలో విజ్ఞాన దీపిక కావాలని కోరుకునేవారందరూ ఒక గొప్ప ఆశయానికి శ్రీకారం చుట్టారని ఈ సమిష్టి కృషి ఫలితంగా 1988 ఫిబ్రవరి 28న విజయవాడలో జనవిజ్ఞన వేదిక ఆవిర్భవించిందన్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు చెకుముఖి పోటీలు నిర్వహించడం, మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యపరచడం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలక్ష్మీ, నర్సులు నీలిమ, రజిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న జెవివి అధ్యక్షులు చరణ్



ఆర్అండ్‌బి స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

మా భూములు మాకు ఇప్పించండయ్యా..!

- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

2002లో మదనపల్లి-తిరుపతి ఆర్అండ్‌బి రోడ్డు కోసం వాల్మీకిపురం పట్టణం తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలోని సర్వే నెంబరు 1260/1ఎలో స్థానిక ప్రజల వద్ద నుంచి ప్రభుత్వం స్థలాలను కొనుగోలు చేసి, రోడ్డుకు పోయి మిగిలిన భూమిని తిరిగి బాధితులకు అప్పగించినట్లు బాధితులు వాపోతున్నారు. ఒక్కో బాధితుడికి దాదాపు 8 అడుగుల నుంచి 30 అడుగుల వరకు స్థలం ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి చెందిన కొందరు ఆక్రమణ దారులు దర్జాగా ఆక్రమించుకొని ఇండ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్లాట్లుగా ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టారని మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విఆర్ఒ, సర్వేయర్ వెళ్లి హద్దులు నాటారని వాపోయారు. హద్దులను సైతం లెక్కచేయకుండా ఆక్రమణదారులు తమ స్థలాల్లో ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారని బాధితులు కన్నీటిపర్యంతమౌతున్నారు. బాధితులు జిల్లా కలెక్టర్, మదనపల్లి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం దీనిపై స్పందించి చర్యలు తీసుకుంటుందో లేక నిద్రపోతుందో వేచి చూడాలి.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సర్వేను సమర్థవంతంగా చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మదనపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో నిర్వహిస్తున్న పి4 సర్వే, పిజిఆర్ఎస్ రీ సర్వే, రెవెన్యూ సదస్సులలో ప్రజల నుండి అందిన వివిధ సమస్యల అర్జీల పరిష్కార ప్రగతిపై తహశీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఒలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది దిగువన ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకొని పేదరికం నిర్మూలించే దిశగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. లబ్ధిదారుల గుర్తింపులో సర్వేను సమర్ధ వంతంగా కొనసాగించాలని తెలిపారు. త్వరితగతిన వందశాతం సర్వే పూర్తి చేయాలని చెప్పారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సులో అందిన అర్జీలను కూడా నిర్ణీతకాల పరిమితిలోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూమి సమస్యలపై సదస్సుల్లో వచ్చిన మొత్తం అర్జీలు ఎన్ని పరిష్కరించిన ఎన్ని పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని అని ఆరా తీశారు. పెండింగ్ ఉన్న వాటికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులు అన్నిటిని నాణ్యతతో వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల స్పందన కూడా తెలుసు కుంటున్నారని, అర్జీల పరిష్కారంలో ఎక్కడా నిర్లక్ష్యం చూపరాదని, నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. మండలంలో ప్రభుత్వ భూములకు తప్పనిసరిగా రక్షణ కల్పించాల న్నారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఎలాంటి ఉపేక్ష లేకుండా వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహశీల్దార్ ధనుంజయులు, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఒలు విఆర్ఎలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి-కలకడ

అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ తెలిపారు. మండలంలోని దేవలంపేటలో వెలిసిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత కొన్ని ఏళ్ల తర్వాత సత్సంగం కువైట్ వారిచే నూతనంగా రథాన్ని తయారు చేయించి, రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషదాయకమని పలువురు పేర్కొన్నారు. రథోత్సవ కార్యక్రమంలో శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని ప్రత్యేక అలంకరించి, పూజలు నిర్వహించి, రథాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో పూలతో అలంకరించి గుడి ప్రాంగణంలో విహరింప చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు విజయసారధి శర్మ ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాళేశ్వరస్వామి..

రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం గ్రామ సమీపంలోని ఎంతో ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ వాళేశ్వరస్వామి కొండపై శుక్రవారం రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి దర్శనార్థం వేల సంఖ్యలో భక్తులు కొండకు పోటెత్తారు. స్వామివారిని సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవ కార్యక్రమానికి మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ , ఎస్ఐ రవికుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయలసీమలోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ జాతర శని వారం నుంచి నిర్వహిం చనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ జాతరకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలిపారు.



జాతరకు ఏర్పాటైన గంగమ్మ దేవాలయం

మండలంలోని అనంతపురం గ్రామ ంలో కొలువుతీరిన గంగమ్మ జాతరకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారని అన్నారు. ప్రతియేటా మహాశివరాత్రి ముగిసిన రెండవ రోజు నుంచి జాతర ప్రారంభ మవుతుం దని తెలిపారు. మొదటిరోజున నిండు తిరుణాల గానూ రెండవ రోజున మైల తిరుణాల గానూ భావిస్తారు. రెండు రోజులు జాతరకు వచ్చిన భక్తులకు అన్నదానం, ఉచిత తాగునీటి సదు పాయాలు కల్పిస్తామని చెప్పారు. మైల తిరుణాల రోజు సాయంత్రం గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని చాగలగుట్టపల్లెకు చేర్చడంతో తిరుణాల ముగుస్తుందని అన్నారు.శుక్రవారం చాగల గుట్టపల్లెలో అమ్మవారి జాగారం, శనివారం నిండు తిరుణాల, అమ్మవారికి సిద్దిపట్లు, ఓడి మాను తిర గడం, సర్వదర్శనం, బోనాలు, చాందినీ బండ్లు ఊరేగింపు చెక్కభజనలు ఉంటాయని అన్నారు. ఆదివారం మైల తిరుణాల అమ్మవారి ఊరేగింపుతో గంగ స్నానంతో అభిషేకంతో తిరుణాల ముగుస్తుందని అన్నారు. జాతరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. మూడురోజులపాటు భక్తులకు తాగునీరు, ప్రత్యేక స్నానపాటికలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రంజాన్ నెలలో ఉర్దూ పాఠశాలల పని వేళలు మార్చాలి

ప్రజాశక్తి-రామాపురం

రంజాన్ మాసంలో ఉర్దూ పాఠశాలలో పనివేళలు మార్చాలని ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచూరు మైనారిటీ కన్వీనర్ మజురుల్‌హక్ కోరారు. ముస్లిం ఉపాధ్యాయులు, విద్యార్థులు రంజాన్ మాసం లో ఉపవాసాలు ఉంటారని అన్నారు. అందుకు అనుగుణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పాఠశాల నిర్వహించే విధం గా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

పట్టణంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆర్.సరోజమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు తిరుపతి డిఐ సర్వేయర్ వెంకటరత్నం, భర్త ఆర్.శ్రీరాములు చిన్నారులకు, వృద్ధాశ్రమంలోని వృద్ధ మహిళలకు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సరోజమ్మ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం వెలుగు సంస్థలో నిర్వహించినందుకు సర్వేయర్ వెంకటరత్నం, ఆర్.శ్రీరాములు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలను అభినందిస్తూ సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి ప్రిన్సిపల్ పి.లీనా కుమారి, వార్డెన్ స్వీటీ, వెలుగు సిబ్బంది,వృద్ధులు పాల్గొన్నారు.

రేపు వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా పరిధిలోని యువతకు స్థానిక బంగ్లా సర్కిల్ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ తెలిపారు. జిల్లా పరిధిలోని 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల వయసు గల యువత పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. శనివారం జరగవలసిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మార్పును జిల్లా పరిధిలోని యువత గమనించ వలసిందిగా కోరారు. జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు, మెడల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని యువత తమ ప్రతిభను చాటుకోవాలని తెలిపారు.వివరాలకు 9182382644 సంప్రదించాలని తెలిపారు.

సత్తా చాటిన 'బిట్స్' కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-రామాపురం

అనంతపురం జెఎన్‌టియు విడుదల చేసిన ఫస్ట్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్‌లో బిట్స్ ఇంజ నీరింగ్ విద్యార్థులు సత్తా చాటారని కళాశాల చైర్మన్ మనుబోలు భాస్కర్ తెలి పారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ కళాశాలకు చెందిన పరాన్ సాదా భాను మ సిఎస్ 87.5 శాతంతో యూనివర్సిటీలో టాపర్‌గా నిలిచారని పేర్కొ న్నారు.ఏ.జీన్‌సాయిదర్శిని 80.8 శాతం తో టాప్ ర్యాం నిలిచారన్నారు. మరో 20 మంది విద్యార్థులు 80 శాతం, మరో 30 మంది విద్యార్థులు 70 శాతం కన్నా ఎక్కువగా ప్రథమ శ్రేణి సాధించారని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కళాశాల స్థాపించిన అతి తక్కువ సమయం లోనే ఇంత విజ యాలను సాధించారని హర్షం వ్యక్తం చేశారు. కళాశాల స్థాపించిన అతి తక్కువ సమయంలోనే విజయం సాధించడం సంతోషకరమన్నారు. ఈవిజయానికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కళాశాల చైర్మన్

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించు కోవాలి



మదనపల్లి : సివి.రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మిట్స్ వైస్ ప్రిన్సిపల్ కమాల్‌బాషా

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులతో అందరిని అలరించారు. డ్రై ఫ్రూట్స్‌తో చేసిన శరీర అవయవాలు, అట్టముక్కలతో చేసిన సర్వమత సమ్మేళనాన్ని తెలిపే మసీదు, చర్చి, గుడి నిర్మాణాలు, ఎర్రకోట, వివిధ రకాల ఇల్లు, ప్లాస్టిక్ బాటిల్స్ తో చేసిన పెన్ స్టాండ్, పెన్సిల్ బాక్స్, సౌర కుటుంబం నమూనా, చంద్రయాన్ రాకెట్ మోడల్ ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యా యురాలు ఈశ్వరమ్మ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** విద్యార్థులకు సైన్స్‌పై పరిజ్ఞానం ఎంతో అవసరమని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ రూత్ అన్నారు. పట్టణంలోని సమిష్టి విద్యాలయ స్కూల్‌లో కరెస్పాండెంట్ పఠాన్ కరీముల్లాఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ రూత్ హాజరై విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల నమూనాలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ వాటి గురించి తయారుచేసిన విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులు ఎంతో చక్కగా వారు తయారుచేసిన సైన్సు నమూనాల గురించి వివరించారు. కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథిగా ప్రదీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిషార్ అహ్మద్, మేనేజర్ అమరావతి ఉపాధ్యాయులు బాల స్వర్ణలత, హిమబిందు, వనజ పాల్గొన్నారు. **మదనపల్లె: 'మిట్స్'లో..**మిట్స్ ఇంజినీరింగ్ కళావాలలో నేషనల్ సైన్స్ డేను ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కలశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్‌బాషా, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్. చంద్రశేఖర్, బిటెక్ ఫస్ట్ ఇయర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రమోహన్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ జగదీశ్‌బాబు సివి. రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతీయ వైజ్ఞానిక ప్రతిభ ప్రపంచానికి తెలిసిన రోజుగా పరిగణిస్తామని, వైజ్ఞానిక రంగంలో నొబెల్ అందుకున్న దేశం మనదేనని అన్నారు.ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీ యస్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సివిరామన్ అగ్రగణ్యుడని కొనియాడారు. **ఆదిత్యలో.,**ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సైన్స్ దినోత్సవం నిర్వహించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అనేది సైన్స్ అప్లికేషన్అని, విద్యార్థులు అప్లికేషన్స్‌పై దృష్టి పెట్టాలని, కొత్త ఆవిష్కరణలు చేయాలని, విజ్ఞానాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు మాట్లాడుతూ మొబైల్ ఫోన్ నుంచి అంతరిక్ష పరిశోధన వరకు అంతా శాస్త్రవేత్తలు కృషి ఫలితమే అని, కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగశాలలో నిత్యజీవిత సమస్యలు పరిష్కరించడంలో శాస్త్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సైన్స్‌డే కో–ఆర్డినేటర్లు డాక్టర్ కె.శ్రీలలిత, వై.అరుణ్‌కుమార్‌రెడ్డి, వివిధ డిపార్ట్మెంట్ విభాగధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో..** స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాలల జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ మునకు డాక్టర్ దీప సెంట్రల్ సీరికల్చర్ బోర్డు లో పనిచేస్తున్న సైంటిస్ట్ ముఖ్య అధితి గా విచ్చేశారని కరస్పాండెంట్ డాక్టర్ గురుప్రసాద్ తెలిపారు. భారత భౌతిక శాస్త్ర వేత్త సర్ సివి.రామన్ 1928 ఫిబ్రవరి 28 న రామన్ ప్రభావాన్ని కనుగొన్నందుకు గుర్తుగా ప్రతి సంవత్సరవస్త్ర ఈ రోజున జాతీ య సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటు న్నామని తెలిపారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ రమా దేవి, బయలాజికల్ సైన్స్ హెచ్ఒడి డాక్టర్ రమ్య, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర కుమార్, హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని శ్రీ చైతన్య పాఠశాల ఉమ్మడి జిల్లా ఎజిఎం రమణయ్య, అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గిరీష్ కుమార్ తెలిపారు. భువనగిరి పల్లి ఆర్చి వద్ద గల శ్రీ చైతన్య పాఠశాలలో ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సి.వి. రామన్ చిత్రపటానికి పూలమా లవేసి ఘన నివాళు లర్పించారు. విద్యార్థులు చదువుతోపాటు శాస్త్రీయ, సాంకేతిక రంగంలో కూడా రాణించి నూతన ఆవిష్కరణలతో భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో మేటిగా నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ శివశంకర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి దీపిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** కలికిరి ఇండియన్ పబ్లిక్ హైస్కూల్‌లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా కరస్పాండెంట్ సుజాత పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణ పరిరక్షణ, భూసా రాభి వృద్ధి, గ్రీవ్ హౌస్, పరిశుభ్రత, తాగునీరు, వివిధ ఆహారపంటల పరి రక్షణ, చీడపీడలపరి రక్షణ, సంబంధించిన నమూనాలను ఆకట్టుకున్నాయని అ న్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అదినారాయణరెడ్డి, ప్రధానోపా ధ్యాయుడు షా హూ,ఉపాధ్యాయులు నాగజ్యోతి, ఫరహాబేగం, శాంభవి శ్రీ పాల్గొన్నారు. **రామసముద్రం :** విద్యార్థులకు సైన్స్‌పై పరిజ్ఞానం ఎంత అవసరం ఉందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మునిస్వామినాయక్ అన్నారు. శుక్రవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా ర్థులు తయారుచేసిన వివిధ రకాల నమూనాలను ఒక్కొక్కటిగా పరిశీ లిస్తూ వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మ న్ బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు :** విభ ఏరుడైట్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ చైర్మన్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు పేర్కొన్నారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల అంశాలను సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల జ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. ఆకార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ బచ్చు దీప్తి, ప్రిన్సిపల్ చొప్ప సుజాత, ఫైనాన్షియల్ అడ్వైజర్ సుజాతమ్మ, తుమ్మలఅమర్నాథ్, ఉపాధ్యాయులు సుజాత, లక్ష్మీ, పద్మావతి, మాధవి, ప్రభాకర్, విజయ్ కుమార్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** విద్యార్థులు ప్రముఖ శాస్త్రవేత్త నోబెల్, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ సి.వి.రామన్ ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎమ్ రెడ్డప్ప రెడ్డి కోరారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సివి రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గుండె, సోలార్, ప్రకృతిలో పచ్చదనం పర్యావరణం తదితరా అంశాలపై నమూనాలను ప్రదర్శించారు. నాలుగవ తరగతి చిన్నారులు సాయి సుజనా, సుప్రియ, అల్ఫిహ, చక్రధార్ లు ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించిన నాటిక అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఆనంద్, టీచర్లు పద్మావతి, మంజుల, వెంకట కుమార్ పాల్గొన్నారు. **పీలేరు:** స్థానిక అయ్యప్ప రెడ్డి కాలనీ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫౌజియాబేగం మాట్లాడుతూ భారతదేశానికి గర్వకారణమైన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ అద్భుతమైన విశ్లేషణతో విజ్ఞాన శాస్త్రంలో కొత్త ఒరవడిని సృష్టించారని అన్నారు. విద్యార్థులు వివిధ శాస్త్ర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు వై. విజయ కుమారి, సౌజన్య, జీవశాస్త్ర ఉపాధ్యాయులు జానం సుజాత, శ్రీకళ, బోధనా సిబ్బంది ఉమామహేశ్వరి, రాధారాణి, జి. విజయ కుమారి పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** స్థానిక గ్లోబల్ పబ్లిక్ స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలలో సివి రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కరస్పాం డెంట్ దాక్షాయిని మాట్లాడుతూ విద్యార్థులలో స్ఫూర్తిని రగిలించి భారతీయ యువ శాస్త్రవేత్తలుగా ఎదుగేందుకు సివి రామన్ తోడ్పా టును అందించారని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకో వాలన్నారు. చదువుతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించు కోవాల ని అన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల, భౌతిక నియమాల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుల్లంపేట : నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఫ్రైడేని డ్రైడేగా పాటించాలి : డాక్టర్ కావ్యగంధ

ప్రజాశక్తి-కలికిరి

ఫ్రైడే నీ డ్రైడేగా పాటిస్తే అంటువ్యాధులు దూరంగా ఉంటాయని సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్యగంధ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుక్కలొడ్డు గ్రామంలో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా ప్రజలకు దోమలు కాటు ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఫ్రైడేని డ్రైడే గా పాటిస్తే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వంటి జ్వరాల బారిన పడకుండా ఉంటామని అన్నారు. మెడికల్ హెల్త్ ఎడ్యూ కేటర్ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఈ ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదం అని, ఇటీవలే ప్రభుత్వం మలేరియా వ్యాధిని నోటిఫైబల్ డిసీస్‌గా గుర్తించిందని అన్నారు. తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్ప లేకపోవడం, శరీరంపై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయని తెలిపారు. వ్యాధి లక్షణాలను బట్టి రక్త పరీక్షలు చేయించుకుని, సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేసుకోవాలని తెలిపారు. పందులను గ్రామానికి 5కి.మీ దూరంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీటి నిల్వలు పై మూతలు ఉంచాలని, దోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్ కొట్టించాలని, ప్రతీ రోజు సాయంత్రం ఇంటిలో పచ్చి వేపాకు పొగ వేసు కోవడం, ప్రతీ రోజు ఇంటిలో సాయంత్రం లైట్స్ వేసినప్పుడు తలుపులు, కిటి కీలు మూసివేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పది సంవత్సరాలు లోపు పిల్లలు, అరవై సంవత్సరాలు పైబడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కు వ కనుక ఈ వర్గానికి చెందిన వారు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి ముజీబ్, ఎఎన్ఎంపార్వతి, ఆశా కార్యకర్తలు చంద్రమ్మ, ఆదిలక్ష్మి, 104సిబ్బంది ఆశ, భాష ప్రజలు పాల్గొన్నారు.



పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



కమిషనర్ పల్లవిని సన్మానిస్తున్న దర్జీలు

దర్జీలకు సహాయ, సహకారాలు : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టైలర్స్ డేని పురస్కరించుకొని శ్రీలక్ష్మి వెంకటేశ్వర టైలర్స్ వెల్ ఫైర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిచౌక్ బస్టాండులో ఏర్పాటు చేసిన టైలర్స్‌డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాకమిషనర్ జీ.వి.పల్లవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్జీలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించడంలో కృషి చేస్తుందని ఆమె తెలిపారు. టైలర్స్ సంఘం అధ్యక్షుడు తాజ్‌బాషా మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తుల కారణంగా దర్జీలు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వంలో దర్జీలకు ఇంటి స్థలాలతోపాటు పక్కా గృహాలను మంజూరు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మహిళ టైలర్లు కొరకు ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు, నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, బి.కొత్తకోట మండలం ట్రెజరీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గోవింద్, ఉపాధ్యక్షుడు వెంకటరత్నం చిన్న, కార్యవర్గ సభ్యులు,వెంకట్ రమణ, పుష్పరాజు, సాదిక్, జఫ్రీజ్, ప్రకాష్, అమీర్‌బాషా, జామీర్‌బాషా, టి. భావజన్, ఆనంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీరామ్ చినబాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశానికి మదనపల్లెకు వచ్చిన కలెక్టర్ శ్రీధర్ చామకూరిని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ యువ అధికారుల పనితీరుతో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కలెక్టర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహశీల్దార్ ధనుంజయులు వంటి చురుకైన అధికారులతో ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని అన్నారు. జిల్లా అభివృద్ధికై అధికారులకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై ఉక్కుపాదం మోపుతామని కలెక్టర్ హెచ్చరించినట్లు తెలిపారు. అటు అధికా రులు, ఇటు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టి.కృష్ణప్ప నాయుడు, మల్లెం ప్రకాష్ నాయుడు, మహబూబ్ ఖాన్, మోడెం శివకుమార్ ఉన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీరామ్ చినబాబు



ట్రాక్టర్‌లో తరలుతున్న మట్టి

బి.కొత్తకోటలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- పట్టని అధికారులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది.మండల సమీపంలోని దేగానిపల్లి చెరువులో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో జెసిబి సాయంతో మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. మట్టి మాఫియాకు అడ్డు అదుపు లేకుండా కొండలు, గుట్టలు చెరువులు అనే భేదం లేకుండా ఎక్కడపడితే అక్కడ ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. 27వ తేదీ నాటికి గడువు ముగిసినా కూడా మట్టి రవాణా సాగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గుండె వ్యాధి గ్రస్తులకు సేవలు

ప్రజాశక్తి-సుండుపల్లి

గ్రామాల్లో గుండెజబ్బులతో బాధపడుతున్న గుర్తించి అరుణ హార్ట్ ఫౌండేషన్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు అరుణ తెలిపారు. శుక్రవారం స్థానిక అరుణ హార్ట్ ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సుండుపల్లి, వీరబల్లి, సంబేపల్లి, కెవిపల్లి మండలాల్లో ప్రాంతాల లో గుండె జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఉచిత సేవలు అందించేందుకు మా సంస్థ పనిచేస్తుందని అన్నారు. పేదరి కంతో ఆస్పత్రి వచ్చి చూపించుకోలేని వారిని గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్ళి మందులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఫౌండేషన్ సభ్యులు ప్రతి గ్రామానికి వెళ్లి హృద్రోగులను గుర్తించి సేవలు అందిస్తున్నారని అన్నారు. తమ ఫౌండేషన్ సేవలను సిఎం చంద్రబాబు కూడా గుర్తించారని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రెజరర్ బి.ఈశ్వరయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరయ్య

35 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని స్థానిక బస్టాండ్ ఎదురుగా వినాయక మెడికల్ స్టోర్ ఆధ్వర్యంలో శుక్రవారం 35 మందికి షుగరు, బిపి, థైరాయిడ్ వంటి దీర్ఘ వ్యాధు లకు డాక్టర్ వెంకటేశ్వరయ్యఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ స్టోర్ శంకరయ్య మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో మూడువారాలకు ఒక సారి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. శ్రీపద్మావతి షుగర్ క్లినిక్ వారి ద్వారా వైద్య నిపుణులుగా అనుభవం ఉన్న డాక్టర్ వెంకటేశ్వరయ్య ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌టిసికి రూ.24 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మహాశివరాత్రి సందర్భంగా మల్లయ్యకొండపై జరిగిన ఉత్సవాలకు మల్లయ్య కొండకు వచ్చే భక్తులు సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సులు నడపడంతో 24 లక్షలు ఆదాయం వచ్చి నట్లు మదనపల్లె–1 డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. మల్లయ్యకొండ కింద నుంచి కొండపైకి నడిపిన బస్సుల ద్వారా రూ.17,57,880లు, మదనపల్లి నుంచి మల్లయ్య కొండ కింద వరకు నడిపిన బస్సుల ద్వారా రూ.6,76,581లు, మొత్తం రూ.24,34,461లు ఆదాయం వచ్చినట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ తెలిపారు.

క్రైం కార్నర్



నిందితుడు చలపతి అరెస్టును చూపుతున్న పోలీసులు

రెవెన్యూ అధికారులపై దాడి చేసిన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి చేసిన కబ్జాదారుడిని శుక్రవారం మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి కొండయ్య నాయుడు నిందితుడి అరెస్టు చూపిస్తూ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మదనపల్లి మండలం, కొండామర్రిపల్లె పంచాయతీ, దేవతానగర్ సర్వే నంబర్ 1029లో స్థానికంగా ఉంటున్న చలపతి ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలను చేపట్టడంతో సమాచారం అందుకున్న ఆర్ఐ శేషాద్రిరావు, విఆర్ఒ ప్రసాద్ 26న సంఘటన స్థలానికి వెళ్లారని అన్నారు. జెసిబితో అక్రమాలను తొలగించే ప్రయత్నం చేయగా చలపతి తన అనుచరులు ప్రదీప్ రమణయ్య రెవెన్యూ అధికారులపై దాడి చేసి వేట కొడవళ్లతో హత్యాయత్నానికి పాల్పడ్డారని అన్నారు. జెసిబికి నిప్పు పెట్టి, అద్దాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అనంతరం ప్రధాన నిందితుడు చలపతిని రెండు రోజుల్లోనే అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. రెవెన్యూ అధికారులపై ఎవరైనా దాడులకు పాల్పడినా, విధులకు ఆటంకం కలిగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయితే ఉపేక్షించేది లేదని ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడే వ్యవహరించాలని డిఎస్‌పి పేర్కొన్నారు.చలపతిని అరెస్టు చేశామని, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారిని కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె డివిజన్ పరిధిలో 133 మంది పేకాట రాయుళ్లు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 26, 27 తేదీల్లో శివరాత్రి పండగ సందర్భంగా మదనపల్లె డివిజన్‌లో పెద్ద స్థాయిలో పేకాట జరిగినట్లు తెలిపారు. పోలీసులు స్థావరాలపై దాడులు చేసి మొత్తం 12 కేసులు నమోదు కాగా రూ.1.82 లక్షలు నగదు స్వాధీనం చేసుకొని 133 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.